# మెట్రో ఫేజ్-2కు రూ.11,693 కోట్లు

పలు ఆర్థిక సంస్థల నుంచి అప్పులు

కేంద్రం 18 శాతం వాటాపై మెట్రో ఆశలు

- జనవరి మొదటి వారంలో ఓల్డ్ సిటీ మెట్రో కూల్చివేతలు
- రూ. 24వేల కోట్ల అంచనా వ్యయంతో రెండో దశ మెట్రో విస్తరణ
- వెల్లడించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి





సిటీబ్యూరో, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): మెట్రో ఫేజ్-2 కోసం రూ.11,693 కోట్ల రుణాలతో విస్తరించేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే డీపీఆర్ పూర్తి కాగా, మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయంలో 48 శాతం మేర జైకా, ఏడీబీ, ఎన్డీబీ (మల్టీ లేటరల్) వంటి ఆర్థిక సంస్థలను ఆశ్రయించనుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 7313 కోట్లు(30 శాతం), కేంద్ర వాటా రూ.4230 కోట్లు(18 శాతం), మల్టీ లేటరల్ సంస్థల నుంచి 48 శాతం, అనగా రూ.11,693 కోట్లను రుణాల రూపంలో నిధులు సేకరించనుంది. ఈ అప్పులకు కేంద్రం గ్యారంటీగా ఉండగా, మిగిలిన 4 శాతం మేర రూ.1033 కోట్లను పీపీపీ విధానంలో సమకూర్చి ప్రాజెక్టును చేపడుతామని తెలిపారు. మొత్తం ప్రాజెక్టులో ఇదే కీలకమన్నారు. మెట్రో రైల్ ఫేజ్-1 నవంబర్ 28తో ఏడేళ్లు పూర్తి చేసుకోనుండగా, ఫేజ్-2 విస్తరణపై హెచ్ఎంఆర్ఎల్/ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. నగరంలో రెండో దశలో ఆరు కారిడార్లలో 116.4 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించనున్నట్లుగా తెలిపారు. ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్లు, మిగిలిన ఆరో కారిడార్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీకి 40 కిలోమీటర్ల మేర ప్రతిపాదనలను విడిగా రూపొందించినట్లుగా తెలిపారు. మిగిలిన 5 కారిడార్లకు రూపొందించిన డీపీఆర్‌కు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదంతో కేంద్రానికి అందించినట్లుగా స్పష్టం చేశారు.

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా మెట్రో విస్తరణ అత్యంత కీలకంగా మారిందన్నారు. తొలి దశలో అందుబాటులో ఉన్న మెట్రోతో నిత్యం 5.8 లక్షల మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. రెండో దశ మెట్రోతో 10 లక్షల మంది ప్రయాణించే సౌకర్యం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. మియాపూర్ నుంచి ఎల్బీ నగర్ వరకు, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు, నాగోల్ నుంచి రాయదుర్గ్ వరకు మొత్తంగా 69 కిలోమీటర్ల మూడు కారిడార్లలో మెట్రో మొదటి దశను రూ.22148 కోట్లతో పీపీపీ విధానంలో చేపట్టినట్లుగా తెలిపారు. ప్రస్తుతం, హైదరాబాద్ నగర అవసరాలకు అనుగుణంగా మెట్రో విస్తరణ అత్యంత కీలకంగా మారిందని, దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో మెట్రో పరిధి పెరుగుతుందన్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోనూ మెట్రో విస్తరణ చేయాల్సిన వచ్చిందన్నారు.

### మొదటి దశలో మూడు కోచ్‌లే...

రెండో దశలో అందుబాటులోకి వచ్చే మెట్రో రైలులో మూడు కోచ్‌లే ఉంటాయని స్పష్టం చేశారు. కానీ, స్టేషన్లను మాత్రం ఆరు కోచ్‌లకు అనుగుణంగా నిర్మిస్తామని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కోచ్‌లను ఆరుకు పెంచనుంది. అయితే, ఫేజ్-1లో ఎదురైన ఇబ్బందుల దృష్ట్యాల పార్కింగ్, బస్ బే, ఆటో ఫీడర్ బేలతో పాటు గ్రౌండ్ లెవల్‌లో మరింత స్థల సేకరణపై దృష్టి పెడతామన్నారు. ఎంఎంటీఎస్, ఆర్టీసీ, స్విడా, ర్యాపిడో వంటి పలు రకాల రవాణా మార్గాలతో అనుసంధానం చేస్తామన్నారు. సిగ్నలింగ్, ఓహెచ్ఈ, కలెక్షన్, రోలింగ్ స్టాక్ వంటి వాటిలో ఆధునాతన సాంకేతికతను వినియోగిస్తామని స్పష్టం చేశారు.

### రుణాలతో రెండో దశ...

రెండో దశ విస్తరణ కోసం హెచ్ఎంఆర్ఎల్ భారీ స్థాయిలో రుణాలను సేకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయంలో కేంద్ర, రాష్ట్ర వాటాలు పోను మిగిలిన మొత్తాన్ని జైకా, ఏడీబీ, ఎన్డీబీ వంటి సంస్థల నుంచి సేకరించనుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్త పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ముందు వరుసలో ఉండటంతో... పలు ఫైనాన్షియల్ సంస్థలు ముందుకు వస్తున్నాయని, వేల కోట్ల రూపాయలు దేశంలోని మెట్రో నగరాల్లో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో 2శాతం వార్షిక వడ్డీతో రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. దీనికి ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలు కూడా వర్తించవనీ, కేంద్ర పూచీకత్తుతో నిధుల సేకరణ సులభతరం అవుతుందన్నారు. మల్టీ లిటరెల్ సంస్థల ద్వారా రూ. 11,693 కోట్లు సేకరిస్తామన్నారు. మొదటి దశ మెట్రో వడ్డీ భారం కంటే వార్షికంగా 7శాతం మేర తగ్గుతుందన్నారు.

### తొలిసారి అండర్‌గ్రౌండ్ మెట్రో

దేశంలోని ఇతర నగరాల మెట్రో నిర్మాణ వ్యయంతో పోల్చితే... రెండో దశ మెట్రో నిర్మాణ వ్యయం భారీగా తగ్గుతుందన్నారు. కిలోమీటర్ మెట్రో నిర్మాణానికి రూ.318 కోట్లు ఖర్చవుతుందన్నారు. బెంగుళూరులో రూ. 373 కోట్ల నుంచి 569 కోట్లు, చెన్నయ్‌లో రూ.619-756 కోట్లు, ముంబైలో రూ.543 కోట్లు నుంచి 1492 కోట్లుగా ఉందన్నారు. డిజైనింగ్ ఇన్నోవేషన్ ఆధారిత ఎలివేటెడ్ మెట్రో వలన తక్కువ ఖర్చుతో మెట్రో నిర్మాణం చేపడుతున్నట్లుగా తెలిపారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఏజెన్సీ ద్వారా ఈ ప్రాజెక్టును చేపట్టనుండగా, అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంతంలో సుమారు 1.6 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ మెట్రో అందుబాటులోకి వస్తుందని, మిగిలిన అన్ని కారిడార్లలో ఎలివేటెడ్ నిర్మాణమే ఉంటుందని స్పష్టం చేశారు.

### జనవరి ఫస్ట్ వీక్‌లో షురూ..

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు నిర్మించనున్న 7 కిలోమీటర్ల మేర ఓల్డ్ సిటీ మెట్రో పనులు డిసెంబర్ నెలాఖరు నుంచి వేగంగా జరుగుతాయన్నారు. జనవరి మొదటి వారంలో కూల్చివేతలతో పాటు, పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇప్పటికే మెట్రో వల్ల రోడ్డు విస్తరణ ప్రభావితం అవుతున్న వారసత్వ, మతపరమైన కట్టడాలకు నష్టం లేకుండా ప్రాజెక్టును చేపడుతున్నట్లుగా తెలిపారు. ఈ ప్రాజెక్టు మొత్తం కూడా మొత్తం హెచ్ఏఎంఎల్ చేపడుతుందన్నారు.

### నార్త్ సిటీలో ఇప్పట్లో లేనట్లే...

రెండో దశలో నార్త్ సిటీకి మెట్రో విస్తరణపై భారీ స్థాయిలో చర్చ జరుగుతుంది. కానీ, క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో నార్త్ సిటీలో ఉన్న ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుంచి తూంకుంట వరకు మెట్రో నిర్మాణంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. కానీ, రెండో దశలో సాధ్యం కాదని, రైట్ ఆఫ్ వే, భూ సేకరణ, రక్షణ శాఖ భూముల సమీకరణ వంటి అంశాలు ఈ ప్రాజెక్టుకు ఆటంకం కలిగిస్తాయన్నారు. అయితే, ఈ మార్గంలో ప్రతిపాదిత హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుతో హెచ్ఎంఆర్ఎల్ సమన్వయం చేసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. డబుల్ డెక్కర్ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నా, రెండో దశలో సాధ్యం కాదన్నారు.

### మెట్రో ఫేజ్-2

| | |
|---|---|
| మొత్తం కిలోమీటర్లు | 116 |
| మొత్తం స్టేషన్లు | 54 |
| అండర్ గ్రౌండ్ | 1.6 కిలోమీటర్లు(శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో) |
| కారిడార్లు | 5+1(ఎయిర్‌పోర్టు టూ ఫోర్త్ సిటీ) |
| అంచనా వ్యయం | రూ. 24,269 కోట్లు(76.4కి.మీ) |
| రాష్ట్ర వాటా | రూ. 7313 కోట్లు (30శాతం) |
| కేంద్ర వాటా | రూ. 4230 కోట్లు(18శాతం) |
| ఆర్థిక సంస్థల రుణాల వాటా | రూ. 11,693 కోట్లు (48శాతం) |
| పీపీపీ వాటా | రూ. 1033 కోట్లు (4శాతం) |
| వడ్డీ రేటు | 2శాతం (వార్షికంగా) |

## ప్రతి కార్పొరేటర్‌కు రెండు లక్షల క్రీడా సామగ్రి


- నేడు స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదన

సిటీబ్యూరో, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రతి కార్పొరేటర్‌కు రూ.2 లక్షల విలువ గల క్రీడా సామగ్రిని అందజేయాలని నిర్ణయించారు. క్రీడాభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌కు రెండు లక్షల క్రీడా సామగ్రి పంపిణీకి గానూ క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, క్యారమ్, చెస్, బాస్కెట్ బాల్, వాలీబాల్, పుట్‌బాల్, స్కేటింగ్, టెన్నిస్, టెబుల్ టెన్నిస్ తదితర క్రీడా సామగ్రి అందజేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా ఈ క్రీడా సామగ్రిని అందజేయనున్నారు. ఈ మేరకు ఈ ప్రతిపాదనను బుధవారం (నేడు) మేయర్ అధ్యక్షతన జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించి ఆమోదం తెలపనున్నారు. అనంతరం, కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి ఆ తర్వాత ఈ ప్రతిపాదనను అమలు చేయనున్నారు.

## డిసెంబర్ 6 నుంచి వైజ్ఞానిక ప్రదర్శన

సిటీబ్యూరో, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): డిసెంబర్ 6, 7వ తేదీల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముషీరాబాద్‌లోని సెయింట్ పాయిస్ హైస్కూల్‌లో జరుగుతుందని హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణీ మంగళవారం తెలిపారు. అందులో భాగంగా స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులలో నూతన ఆలోచనలను ప్రోత్సహించి వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉప విద్యా శాఖాధికారి చిరంజీవి, జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్ పాల్గొన్నారు.

## సన్‌షైన్ ఆసుపత్రిలో యువకుడి భుజానికి అరుదైన సిస్టర్ శస్త్ర చికిత్స



డాక్టర్ చంద్రశేఖర్

బేగంపేట్ నవంబర్ 26: సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్‌లో ఓ బాధితుడి భుజానికి విజయవంతంగా 'సిస్టర్ శస్త్ర చికిత్స' చేపట్టారు. బేగంపేట్‌లోని కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రిలో ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ షోల్డర్‌కు అరుదైన 'సిస్టర్ శస్త్ర చికిత్స'ను విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన ఈ శస్త్రచికిత్స వివరాలను ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు మీడియాకు తెలిపారు. బాస్కెట్‌బాల్ ఆడుతూ భుజానికి తీవ్ర గాయమై, నొప్పితో బేగంపేట్‌కు చెందిన 25 ఏండ్ల యువకుడు సన్‌షైన్ ఆసుపత్రికి వచ్చాడు. అయితే, ఆ యువకునికి ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ రిపేర్ సర్జరీని సన్‌షైన్ ఆసుపత్రి చీఫ్ షోల్డర్ సర్జన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. వైద్యులు పరీక్షించి భుజం లోపల కార్టిలేజ్ దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఆర్థోస్కోపిక్ విధానంలో కార్టిలేజ్ రిపేరు చేయాలని నిర్ణయించి విప్లవాత్మక కొండ్రోపిల్లర్ సాంకేతికను ఉపయోగించి శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. ఈ సర్జరీ విజయవంతంగా పూర్తి చేసినట్టు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

## ఎస్టీపీలను సందర్శించిన జల మండలి ఈడీ

సిటీబ్యూరో, నవంబరు 26(నమస్తే తెలంగాణ): ఎస్టీపీ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న రెండు మురుగు నీటి శుద్ధి కేంద్రాలను జల మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ సందర్శించారు. 320 ఎంఎల్‌డీ సామర్థ్యంలో నాగోల్‌లో, 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో వెన్నెలగడ్డలో నిర్మిస్తున్న ఎస్టీపీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈడీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎస్టీపీ ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణానికి సుందరీకరణ పనులు చేపట్టాలని తెలిపారు.

# మూసీలోకి కెమికల్ డంప్..

- మూసీ కాలుష్యాన్ని అరికట్టని ప్రభుత్వం..!
- సుందరీకరణకు చర్యలు చేపట్టేనా..?
- బాపూఘాట్ ఒడ్డున సొరంగ మార్గం..!
- పవిత్ర సంఘం - రసాయనాలతో అపవిత్రం.
- నిర్మాణం చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: స్థానికులు



సొరంగ మార్గం పైపులేను పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

బండ్లగూడ, నవంబర్ 26: మూసీ నదిలోకి రసాయనిక వ్యర్థాల డంపింగ్ ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నది. స్థానికంగా ఉన్న రసాయనిక కంపెనీల నుంచి యథేచ్ఛగా డంపింగ్‌ను ఎవ్వరికీ తెలియకుండా సొరంగ మార్గం గుండా చేపడుతున్నారు. అయితే, ఇటీవల స్థానికుల ఒక సొరంగ మార్గం అగుపించి వారిని ఆశ్చర్యానికి గురి చేసింది. స్థానికులు శోధించగా, బాపూఘాట్ మూసీ నది వడ్డున సొరంగ మార్గం బయట పడింది. ఇది గోల్కొండ రాజులు తవ్విన మార్గం కాదు. పారిశ్రామిక వేత్తలు దొంగ మార్గంలో తవ్వించిన సొరంగం. నగర శివారు ప్రాంతంలోని బాపూఘాట్ వద్ద కెమికల్ డంపు గుటురట్టు అయ్యింది. అత్యంత ప్రమాదకరమైన పారిశ్రామిక వ్యర్థాలను లారీల ద్వారా తెచ్చి ఈ సొరంగ మార్గం నుంచి పవిత్ర బాపూఘాట్ సంఘమ స్థానం వద్ద నీటిలోకి పంపు చేస్తున్నారు. ఈ విషయంపై అనుమానం వచ్చిన కొంత మంది స్థానికులు లారీ డ్రైవర్‌ను పట్టుకుని నిలదీయగా, అసలు విషయం గుట్టు రట్టు అయ్యింది.

మూసీ నది ఒడ్డున కంకర ఇసుక సరఫరా చేస్తున్న కొంత మందితో వ్యాపారులతో పారిశ్రామిక వేత్తలు కుమ్మక్కై పకడ్బందీగా సొరంగ మార్గం తవ్వి మూసీలోకి విషపూరిత రసాయనాలు పైపులేన్ వేసి డంపు చేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న ఈ తతంగం ఎప్పటి నుంచో కొనసాగుతుంది. పటాన్ చెరువు, షాద్‌నగర్, బాలానగర్, జీడిమెట్ల, ఐడీఏ బొల్లారం తదితర ప్రాంతాల నుంచి లారీల ద్వారా తెచ్చి ఈ రసాయనాలను డంపు చేస్తున్నారు. ఒక్కొక్క లారీకి 25 వేల వరకు ఇసుక వ్యాపారులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

### ఈసీ, మూసీ నదిల కలయికే సంగమం..

దేశంలోనే ప్రసిద్ధి గాంచిన బాపూఘాట్ వద్ద హిమయాత్ సాగర్ (ఈసీ)గండిపేట (మూసీ) నదుల నీళ్లు కలుస్తాయి. దీంతో ఇక్కడ సంఘం ఏర్పడి అనేక ప్రత్యేక పూజలకు నిలయంగా మారింది. ఇక్కడి నీళ్లు ఎంతో కొంత పరిశుద్ధంగా ఉండి ఆహ్లాదాన్ని పంచుతాయి. వలస పక్షులులతో పాటు రకరకాల పక్షులు ఇక్కడ కొలువుదీరుతాయి. కొంత మంది పారిశ్రామిక రసాయనాలను ఇక్కడ డంపు చేయడం ద్వారా ఈ ప్రాంతం అంతా కలుషితమై ఇక్కడ నుంచి జియాగూడ, కార్వాన్, పురాణాపూల్ తదితర ప్రాంతాల గుండా ప్రవహిస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. దీని ద్వారా పలువురు రోగాల పాలయ్యారు.

### పట్టుబడిందిలా...

అర్ధరాత్రి సమయంలో దొంగ చాటున సాగుతున్న మూసీలోకి పంపిస్తున్న వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతుంది. సంఘం ఒడ్డున ఉన్న రామాలయంలో అయ్యప్ప స్వాములు లింగరెడ్డి, భరత్, శ్రీనివాస్ యాదవ్, సదా పటేల్, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ గౌడ్‌లు విష వాయువు ఎక్కడ నుంచి వస్తుందని పసిగట్టి వారిని పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు స్థానికులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, కొమురయ్యలు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి: స్థానికులు

మూసీ సుందరీకరణ పేరుతో వందల కోట్లు వెచ్చిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం, అసలు కాలుష్యాన్ని అరికట్టడానికి కనీస చర్యలు తీసుకోవడం లేదు.

# పట్టణీకరణతో పర్యావరణమూ ముఖ్యమే..

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్




లేక్స్ 2024 సదస్సులో ప్రసంగిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

అమీర్‌పేట్, నవంబర్ 26: పట్టణీకరణకు ఎంతటి ప్రాముఖ్యత ఉందో.. భవిష్యత్ తరాలకు మెరుగైన జీవనాన్ని ప్రసాదించేందుకు ఈ రోజున పర్యావరణ పరిరక్షణకు కూడా అంతటి ప్రాముఖ్యతనిస్తూ కాపాడుకోవాల్సిన అవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. పట్టణీకరణలో భాగంగా నగరంలో భూములకు, ఇండ్ల స్థలాలకు పెరుగుతున్న డిమాండ్‌తో అనేక చోట్ల చెరువులు కబ్జాకు గురయ్యాయని, ఆ విధంగా నగరంలో 61 శాతం చెరువులు అన్యాక్రాంతం కాగా, మిగిలిన వాటి పరిరక్షణకు అందరు భాగస్వాములైతే, మిగిలిన 39 శాతం చెరువులను కాపాడుకునే అవకాశం ఉంటుందని, లేని పక్షంలో రాబోయే 15 ఏళ్ల నాటికి చెరువులు కనిపించకుండా పోతాయన్నారు. గొలుసు కట్టు చెరువుల వ్యవస్థ దెబ్బ తినడం వల్లే నగరంలో 2 సె.మీల వర్షానికి కూడా ముంపు సమస్య వాటిల్లుతోందన్నారు. ఈ క్రమంలో గొలుసు కట్టు చెరువులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ క్రమంలోనే పర్యావరణ సమస్యకు కారణమవుతున్న అనుమతులు లేని అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చిందన్నారు. హైడ్రా చేపట్టిన కూల్చివేతల తరువాతే ప్రజల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, క్యాచ్‌మెంట్ ఏరియా వంటి అంశాలపై అవగాహన పెరిగిందన్నారు. నగరంలో చెరువులు వాటి విస్తీర్ణం, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించే పనులను హైడ్రా చేపట్టిందన్నారు. ఎన్ఆర్ఎస్ఏ, సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ సర్వే విభాగం, విలేజ్ మ్యాప్స్ ఆధారంగా చెరువుల విస్తీర్ణాన్ని నిర్ధారించి, మిగిలి ఉన్న చెరువులనైనా కాపాడుకోవడమే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోందన్నారు. ఇటీవల ఇంజినీరింగ్, మైనర్ ఇరిగేషన్, పర్యావరణ వేత్తలు, చెరువుల పరిరక్షణకు పని చేస్తున్న నిపుణులతో నిర్వహించిన సదస్సులో వారి నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా చెరువుల పరిరక్షణకు హైడ్రా నడుం బిగించిందన్నారు. (సీఎస్ఐఆర్ - ఎన్ఈఈఆర్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో 'పట్టణ చెరువుల నిర్వహణ - లేక్స్ 2024' అనే అంశంపై జరిగిన మేథోమథన సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో పరుగులు పెడుతున్న పట్టణీకరణతో పోల్చి చూస్తే తెలంగాణలో నగరీకరణ 12 శాతం అధికంగా ఉందని నివేదికలు సూచిస్తున్నాయన్నారు. సదస్సులో సీఎస్ఐఆర్-నీరి డైరెక్టర్ డాక్టర్ ఎ.ఎస్.వైద్య, సీఎస్ఐఆర్-నీరి హైదరాబాద్ కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ షేక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యపడదు : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 26 : ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) ట్యాంపరింగ్ చేయబడవని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం కొట్టి వేసిందని పేర్కొన్నారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తి చూపిందని పేర్కొన్నారు.

## 'చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి'



రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్యర్‌కు వినతి పత్రం ఇస్తున్న చేనేత నాయకులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 26 : చేనేత సహకార సంఘంలో నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని చేనేత నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్యర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. నేత బజార్, చేనేత కార్మికుల సమస్యలపై వివరించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు చేనేత నాయకులు తెలిపారు. అనంతరం చేనేత సమస్యలపై రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో చేనేత నాయకులు ఏలె భిక్షపతి, గంజి కృష్ణ, బోగ నరసింహ పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి : టీఎస్ యూటీఎఫ్

మోత్కూరు, నవంబర్ 26 : ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు భారంగా మారిన నూతన పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిర్యాల దామోదర్ అన్నారు. పట్టణంలో మంగళవారం యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దర్శనం వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా అన్నారం సత్తయ్య, కోశాధికారిగా మాతంగి అశోక్, ఉపాధ్యక్షులుగా దడిపెల్లి శ్రీనివాస్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా తొర్ర ఉప్పలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి వెంకటాచారి, గుండా మల్లేశం, ముక్కామల లింగమల్లు, తిరుపతి, వెంకటేశ్వర్లు, ఉమేశ్‌చంద్ర పాల్గొన్నారు.

## రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

భువనగిరి అర్బన్, నవంబర్ 26 : రజక వృత్తిదారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తిదారులకు ఆర్థిక సహకార పథకంలో రూ.10లక్షలు, ప్రతి జిల్లాకు రూ.10కోట్లతో మోడల్ లాండ్రీలు ఏర్పాటు చేస్తామని చెప్పి మరిచిపోయారన్నారు. రజక ఫెడరేషన్ ఏర్పాటుతోపాటు యేటా రూ.100 కోట్ల బడ్జెట్ అందిస్తామని ఇచ్చిన వాగ్దానాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రజకులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వడ్డెబోయిన వెంకటేశ్, వడ్డెమాను బాలరాజు, అవనిగంటి స్వామి, మైసయ్య, ఎలిమినేటి నగేశ్, శ్రీనివాస్, రవి, సతీశ్ పాల్గొన్నారు.

## జనవరి 19న మాదిగల మహాగర్జన : ఎమ్మార్పీఎస్



యాదగిరిగుట్టలో కర పత్రం విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, నవంబర్ 26 : జనవరి 19న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూషి మహేశ్ అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం మాదిగల మహాగర్జన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలు చేయాలని, అసైండ్ భూములను క్రమబద్ధీకరించి పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. మాదిగ, మాదిగ ఉపకులాలను జాగృతం చేసేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం మహేందర్, రాష్ట్ర కార్యదర్శి బైరపాక నాగరాజు, యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసగల్ల రమేశ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగి స్వామి పాల్గొన్నారు.

## 'ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

మోత్కూరు, నవంబర్ 26 : ఎన్నికల్లో ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మోత్కూరు మండల ఆశ కార్యకర్తలు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కనీస వేతన చట్టం ప్రకారం తమకు రూ.18వేల జీతం చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు గుంటి శాంత, మారోజు నవనీత, బోడ ఎల్లమ్మ, బి.జ్యోతి, షేక్ రిజ్వానాబేగం పాల్గొన్నారు.

## మండలంలో సర్వే 98శాతం పూర్తి : ఎంపీడీఓ

ఆలేరు రూరల్, నవంబర్ 26 : మండలంలో ఇప్పటి వరకు ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే 98శాతం పూర్తయిందని ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ తెలిపారు. సర్వేలో నమోదుకాని కుటుంబాల వారు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### రామన్నపేట మండలంలో 96శాతం

రామన్నపేట : సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు నమోదు కానివారు స్థానిక పంచాయతీ కార్యదర్శి వద్ద నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ బి.యాకూబ్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 96శాతం సర్వే పూర్తయిందని పేర్కొన్నారు.

## మొక్కల సంరక్షకుడికి సన్మానం



మొక్కల సంరక్షకుడిని సన్మానిస్తున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 26 : ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండలంలోని కూరెళ్ల, ఆత్మకూరు, తుక్కాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనుల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ రోజులు ఉపాధి హామీ పనిచేసిన కూలీలను, మొక్కల సంరక్షులను, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములునాయక్, ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్, టీఏ యాదిరెడ్డి, ఫిల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, బిల్ కలెక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

## ఇప్పళ్లలో 29న ఉర్సు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 26 : మండలంలోని కొరటికల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పళ్లలో నిర్మించిన అజారత్ జిందిషా మదార్ 42వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 29న జరుగనున్నట్లు దర్గా నిర్వాహకుడు బందా వెంకసాయి తెలిపారు. ఉర్సు సందర్భంగా గుల్బార్గా దర్గా నుంచి దర్గా వంశీయులు, గురువులు హాజరు కానున్నట్లు తెలిపారు. కొరటికల్ నుంచి ఇప్పళ్ల దర్గా వరకు గంధం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవాల నిర్వహణ కమిటీ చైర్మన్ బీసు చందర్‌గౌడ్, వైస్ చైర్మన్ చామకూర నారాయణ కోరారు.